క్లుప్తంగా

డయల్ యువర్ డీఎంకు స్పందన

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించింది. కొత్తగూడెం పట్టణం, పరిసర ప్రాంతాల్లోని రిక్వెస్ట్ బస్టాప్‌ల్లో అన్ని బస్సులను ఆపాలని కోరారు. కొత్తగూడెం బస్టాండ్‌లో ఉన్న వెహికిల్ స్టాండ్‌ను విస్తరింపజేయాలని, ఆళ్లపల్లి ఆనంతోగు ఇల్లెందు వరకు బస్సును నడపాలని పలువురు ప్రయాణికులు సూచించారు. అదేవిధంగా మణుగూరు వైపు ఆర్డినరీ బస్సులను పెంచాలని డీఎం దృష్టికి తెచ్చారు. వీటిని పరిశీలిస్తామని డీఎం ప్రయాణికులకు హామీ ఇచ్చారు.

ఎస్సీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా గోపికిరణ్



నియామకపత్రం అందుకుంటున్న గోపికిరణ్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి ప్రత్యేక సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడిగా చిలుముల గోపి కిరణ్, ఉపాధ్యక్షుడిగా కె.ఇందుకుమారి, ప్రధాన కార్యదర్శిగా బోగా మల్లికార్జున్, జిల్లా కార్యదర్శిగా కనుకుంట్ల రాకేష్, జిల్లా సలహాదారుడిగా మారెళ్లి విజయ్‌కుమార్, మణుగూరు కన్వీనర్‌గా కాసిపెట్టి కృష్ణ, ఇల్లెందు కన్వీనర్‌గా మేకల శంకర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాసు మాట్లాడుతూ... ఎస్సీ కులాల జనాభా పెరిగినందున 20 శాతం రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు.

సన్మానం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ఎంఈఓ ప్రభుదయాల్ పదవీ విరమణ సందర్భంగా శనివారం మధ్యాహ్న భోజన కార్మికులు ఆయన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి స్వప్న, రమాదేవి, సభ్యులు సత్యావతి, కవితలు పాల్గొన్నారు.

'కమీషన్ పనులతో జనం అవస్థలు'

ఇల్లెందురూరల్: కార్యకర్తల కమీషన్లకు పాలకులు మంజూరు చేసిన నిధులతో ప్రణాళికారహితంగా చేపట్టిన నిర్మాణాలు ప్రజలను అవస్థలకు గురిచేస్తున్నాయని సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నబి, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ ఆరోపించారు. మండలంలోని బాలాజీనగర్ పంచాయతీ సంజయ్‌నగర్ సమ్మక్క సారలమ్మ గద్దెల సమీప ప్రాంతం రోడ్లు, కాల్వల దుస్థితిని శనివారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంజయ్‌నగర్ గద్దెల ప్రాంతంలో కాల్వపై కల్వర్టు నాసిరకంగా నిర్మించడంతో సైడ్‌వాల్ వరదలకు ధ్వంసమైందని, రోడ్లు, డ్రైయినేజీలు అధ్వానస్థితికి చేరుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి కృష్ణ, అబ్బాస్, బోస్, రాములు, సత్యనారాయణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ అన్నారు. ఈ మేరకు శనివారం గ్రామంలో సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలు ప్రజలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో దోమలు విలయతాండవం చేస్తుండటంతో ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, బోడా అభిమిత్ర, పెరుమాళ్ల వెంకటేష్, జర్పుల మల్లయ్య, తంబారపు శ్రీను, తంబళ్ల అశోక్, పెరుమాళ్ల పవన్ పాల్గొన్నారు

లాభాల వాటా ప్రకటించాలి

ఇల్లెందు: సింగరేణిలో వాస్తవ లాభాల వాటా 35 శాతం ప్రకటించాలని, ఆదాయపు పన్ను రద్దు చేయాలని, అలవెన్సులపై పన్ను ప్రభుత్వమే చెల్లించాలని, అనారోగ్య సమస్యలున్న కార్మికులందరిని అన్‌ఫిట్ చేయాలని, 24 నెలల సర్వీస్ కాలం పరిమితిని 36 నెలలకు పెంచాలని టీబీజీకేఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు జాఫర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం జీఎం వీసం కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జీఎం కార్యాలయం ఎదుట వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేలం పాటలతో సంబంధం లేకుండా సింగరేణికి నూతన గనులు కేటాయించాలన్నారు. సింగరేణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.43 వేల కోట్లు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. నాయకులు దిండిగాల రాజేందర్, కడకంచి వీరస్వామి, శ్రీను, పాలడుగు రాజశేఖర్, బీఎస్ఆర్ గౌడ్, తుంగ మహేష్, నెమలి నిఖిల్, శివ ఉన్నారు.





మధురమే.. సుధావనం..

ఉద్యానవనాన్ని తలపిస్తున్న సుధాలక్ష్మి ఇంటి ఆవరణ

60వ పడిలోనూ ఇంటిని నందనవనంలా మార్చి..

- సుమారు 600 రకాల మొక్కల పెంపకం
- సేంద్రియ ఎరువుల తయారీ చేసి రక్షిస్తూ..
- మొక్కల పెంపకమే అభిరుచిగా మార్చుకున్న సుధాలక్ష్మి

సండే స్పెషల్

పాల్వంచ: ఆ ఇంటి పేరట్లోకి వెళ్లగానే అనేక రకాల మొక్కలు ఆహా అని ఆశ్చర్యం కలిగించేలా కనువిందు చేస్తుంటాయి. రకరకాల క్రోటాన్‌లు, పూలు , కూరగాయలు, పండ్లు, ఔషధ మొక్కలు చూడముచ్చటగా అనిపిస్తాయి. ఇక చెట్ల తీగలతో అల్లిన పందిరి కింద కాసేపు సేద తీరితే ఆ అనుభూతే వేరుగా ఉంటుంది. ఇలా ఇంటినే నందనవనంలా మార్చి నిత్యం మొక్కల పెంపకంపైనే దృష్టి సారించి తన అభిరుచిని అబ్బురపరిచే విధంగా వాటిని పెంచుతూ అనునిత్యం కాపాడుతున్నారు పాల్వంచలోని శ్రీనివాసగిరి కాలనీకి చెందిన తోలేటి సుధాలక్ష్మీ. ప్రతీ రోజు మొక్కలను సంరక్షించే పనులు చేసుకుంటూ అక్కడే సమయాన్ని గడుపుతుంటారు.

ఖాళీ స్థలాన్ని వదలకుండా..

పట్టణంలోని శ్రీనివాసగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి (గుట్ట) దేవాలయ ప్రధానార్చకులు తోలేటి నగేష్ శర్మ ఇల్లు బృందావనాన్ని తలపిస్తోంది. ఆ ఇంటి పరిసరాలు తీరొక్క మొక్కలతో కళకళలాడుతూ ఉంటుంది. అందుకు నగేశ్ శర్మ తల్లి సుధాలక్ష్మి తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ, అందుకు తన కోడలు నాగ సరోజిని అందజేస్తున్న తోడ్పాటు. సుధాలక్ష్మి తమ ఇంటి వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలాన్ని వృథాగా వదిలేయలేదు. అందులో ఓ నందనవానాన్నే పెంచారు. సుమారు 600 రకాల మొక్కలు పెంచారు. ఇంట్లో పనులను ఎక్కువగా కోడలు చూసుకుంటుండగా, తన సమయాన్ని అంతా మొక్కల పెంపకానికి కేటాయించి కాలక్షేపం చేస్తున్నారు. పరిసరాల్లోకి వెళ్లగానే ఎంత కనువిందు చేసేలా పెంచారు. వందలాది ఖాళీ డబ్బాలు, తొట్లలో మొక్కలు వరుస క్రమంలో ఉంచారు. నిత్యం వాటిని సంరక్షిస్తుంటారు.



ఆవరణలో నాటిన మొక్కలు

ఎన్నో రకాల మొక్కలు పెంచుతూ..

రకరకాల మొక్కలు అక్కడి వాతావరణాన్ని ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. డ్రాగన్ ఫ్రూట్, స్టార్ ఫ్రూట్, మల్బారీ, అంజుర, పనస, మామిడి, రబ్బర్ ప్లాంట్స్, నూరు వరహాలు, స్నేక్ డ్రాగన్, ఫీస్ లిల్లి, థర్టీల్, ఆల్మండ, కృష్ణ కమలం, తమలపాకు, 20 రకాల మందారాలు, లిలీలు, ద్రాక్ష, దొండ, నిచ్చెమల్లి, చెమిలి, ఆడేనయా, కలబంద, చామంతి, అరటి, బెండ, బీర, కాకర, యాలకులు, బ్రహ్మకమలం, లెమన్‌గ్రాస్, వెదురు ఇలా వందలాది మొక్కలను పెంచారు. చక్కటి పందిరి వేసి దాని అనేక రకాల పందిరి ఎంతో ఆకట్టుకుంటుంది. ఇక తనే స్వయంగా ఎరువులు తయారు చేస్తుంటారు. మునగాకు, వేపాకు, కూరగాయల పొట్టు, ఆవు ఎరువు వంటి అనేర రకాల వాటితో సేంద్రియ ఎరువులు తాయరు చేసి మొక్కలకు బలంగా పెరిగే వేస్తుంటారు. 60 ఏళ్ల వయసులోను సుధాలక్ష్మీ మొక్కలపై చూపెడుతున్న ఇష్టాన్ని చూసి పలువురు అభినందిస్తున్నారు.

మొక్కలతోనే నా కాలక్షేపం



నాకు చిన్నప్పటి నుండి మొక్కలంటే ఎంతో ఇష్టం. ఇంట్లో ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా ఇంటి వెనుక ఉన్న 150 గజాల స్థలాన్ని మొక్కలను పెంచేలా గార్డెన్ తయారు చేసా. నాకు అవసరమైన మొక్కలు, ఎరువులు, ఇతర వస్తువులన్నీ నా కొడుకు తెచ్చి ఇస్తుంటాడు. వాటిని ఉపయోగించుకుని రకరకాల మొక్కలు పెంచుతున్నా. అదే నా కాలక్షేపం. ఇలా సుమారు 600 రకాల మొక్కలు ఉన్నాయి. ఏ మొక్కను వదిలేయను. నా కోడలు ఎంతో సహకారం అందిస్తు ఉంటుంది.

– తోలేటి సుధాలక్ష్మి, శ్రీనివాస కాలనీ



మొక్కల సంరక్షణలో సుధారాణి, నాగ సరోజిని

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు సరికాదు



చుంచుపల్లి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



ఇల్లెందులో..

చుంచుపల్లి: భారత ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, వెంటనే క్షమాపణ చెప్పాలని కోరుతూ శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని సూపర్‌బజార్ సెంటర్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం దిష్టిబొమ్మ దహనం చేసిన నాయకులను పోలీసులు అరెస్టు చేసి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైడిపాటి రవీందర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జల్లారపు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గుంపుల మహేష్, నాయకులు ప్రసాద్ గౌడ్, గొడుగు శ్రీధర్ యాదవ్, చుంచుపల్లి మండలాధ్యక్షుడు బలగం శ్రీధర్, తెలంగాణ క్రాంతి, స్వప్న విరేశలింగం, వెంకన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తిని దూషించిన రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ మేరకు ర్యాలీ నిర్వహించారు. బేషరుతుగా రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ పట్టణ అధ్యక్షురాలు సుచిత్ర పాసీ కోరారు. ఈ కార్యక్రమంలో సునీత, మాధవ్, మహేశ్వర్, భట్టు రమేష్, నాగరాజు, సందీప్, నరసింహారెడ్డి, రాహుల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

టేకులపల్లి: పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ ప్రగతిశీల పంచాయతీ, మున్సిపల్ వర్కర్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) టేకులపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూడు బిచ్చు, ఈసం మహేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో జరిగిన యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ... మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని తదితర డిమాండ్లపై సెప్టెంబర్ 7న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి డి.ప్రసాద్, నాయకులు కనతాల అన్నాజీ, కత్తుల ఎర్రయ్య, మాలోతు తావుర్యా, జినకా ప్రసాద్, దుర్గ, రాజేశ్వరి, బాబు, సంపత్, మాడే వెంకటేశ్వర్లు, జంపన్న, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మండప నిర్మాణానికి శంకుస్థాపన

ఇల్లెందు: పట్టణంలోని ఇందిరానగర్ 10వ వార్డులో దుర్గామాత మండప నిర్మాణానికి శనివారం మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండపం కమిటీ సభ్యులు మెరుగు కార్తీక్ యాదవ్, బాస శ్రీనివాస్, చిలుక సైదులు, బాలయ్య, కోటగిరి బాలయ్య, వేణు, సంపత్, జబ్బార్, నాగేశ్వరరావు, వీరన్న, రాంచందర్, మహేందర్, అంజిబాబు, సత్యం, సతీష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణపయ్య పూజలు

గణేష్ నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటుచేసిన వినాయక మండపాల్లో గణపయ్యకు పూజలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు శనివారం నాలుగోరోజు కావడంతో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేసి నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. పలుచోట్ల అన్నదానాలు, లడ్డూపాటలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



సుజాతనగర్‌లో..



కొత్తగూడెంటౌన్: శ్రీ ఇంక్లైన్‌లో..



రామవరం నెహ్రూబస్తీలో..

1న దివ్యాంగుల గుర్తింపు శిబిరం

టేకులపల్లి: దివ్యాంగుల వైకల్య శాతం నిర్ధారణకు సోమవారం కొత్తగూడెంలోని జెడ్పీహెచ్ఎస్(ఆనందఖని)లో నిర్వహిస్తున్న శిబిరానికి అర్హులు హాజరుకావాలని ఎంఈఓ అజ్మీరా జగన్‌నాయక్ సూచించారు. మండలంలోని 18ఏళ్ల లోపు దివ్యాంగులు హాజరైతే వైకల్యశాతాన్ని పరీక్షించి ఉపకరణాలు ఉచితంగా అందిస్తారని తెలిపారు. వైకల్యం కనిపించే రెండు ఫొటోలు, సదరం సర్టిఫికెట్, ఆదాయం లేదా రేషన్, ఆధార్‌కార్డులతో హాజరుకావాలని, వివరాలకు 9989724092, 9177794478 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రెస్‌క్లబ్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ బాధ్యులు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బానోతు వీరు, కార్యదర్శిగా జోగం తారక రామారావు, కోశాధికారిగా చావల పురుషోత్తం, సహాయ కార్యదర్శులుగా వాసాల చంద్రశేఖర్, కొట్టి శివశంకర్, కార్యవర్గ సభ్యులుగా బానోతు రాందాస్, ధరావత్ వెంకన్న, చంద్రగిరి ప్రసాద్‌లు ఎన్నికయ్యారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



జైలులో పరిశీలిస్తున్న జడ్జి కీర్తిచంద్రికరెడ్డి

ఇల్లెందు: ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి కోరారు. శనివారం ఇల్లెందు సబ్‌జైలును సందర్శించి పరిశీలించారు. అక్కడి ఖైదీలను జైలులోని సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాల సీజన్‌లో వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. జైలు జీవితం ఒక పాఠంగా చేసుకుని నేరారోపణ ఎదుర్కొంటున్న వారు జైలు నుంచి విడుదలైన అనంతరం సంఘంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు తెచ్చుకోవాలని తెలిపారు. అనంతరం ఖైదీలకు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్, జైలర్ చంద్రశేఖర్, హెడ్ వార్డెన్ భుజంగరావు, సిబ్బంది భాస్కర్, శ్రీనివాస్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలు



మాట్లాడుతున్న డీఐఈఓ వెంకటేశ్వరరావు

పాల్వంచరూరల్: ప్రభుత్వం విద్యపై తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ కారణంగా నేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలకు దీటుగా ఉన్నాయని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి (డీఐఈఓ)హెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని వీరునాయక్‌తండా సమీపంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఘనంగా ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. అనంతరం ప్రిన్సిపాల్ శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు నాణ్యమైన విద్య పొంది భావితరాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. జిల్లా టీజీఓ సంఘం అధ్యక్షులు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటపుల్లయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు..



మాట్లాడుతున్న డీజీఎం శ్రీకాంత్

సింగరేణి(కొత్తగూడెం): సమస్యలను ఏరియా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో పరిష్కార మార్గం చూస్తామని డీజీఎం శ్రీకాంత్ అన్నారు. కొత్తగూడెం ఏరియా వర్క్‌షాపులో ఆధ్వర్యంలో శనివారం సేఫ్టీ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా త్రీ ఇంక్లైన్ సబ్‌స్టేషన్, ఫిల్టర్‌బెడ్‌ను పర్యవేక్షించి అందులోని లోపాలను డీజీఎం దృష్టికి తీసుకొచ్చారు. త్రీ ఇంక్‌లైన్‌లో పాత సబ్‌స్టేషన్ రూం శిథిలావస్థలో ఉన్నందున కొత్త సబ్‌స్టేషన్ నిర్మించాలని కమిటీ సూచించింది. అదేవిధంగా పాత సబ్‌స్టేషన్ చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేయాలని, ఉద్యోగులు మస్టర్ పడే మ్యాన్‌వే వద్ద షెడ్డు నిర్మించాలని, ఆర్వో ప్లాంట్ మరమ్మతు చేయాలని, క్యాంటిన్ సదుపాయలు పెంచాలని కోరారు. వర్క్‌షాపులో సిబ్బంది కొరతను నివారించాలని నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాపు ఇంజనీర్లు బి.శంకర్, టి.అనిల్, ఏ.ఉపేందర్‌బాబు, ఐఎన్‌టీయూసీ పిట్ కార్యదర్శి సత్తార్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మధుకృష్ణ, ఎలక్ట్రికల్ వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ వై.రవి, సేఫ్టీ కమిటీ సభ్యులు యాకుబుద్దీన్, సలిగంటి తిరుపతి, గుమ్మడి మురళి, కే.కరుణాకర్, మహేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రత, పచ్చదనానికి కృషి



మాట్లాడుతున్న ఎంఈఓ జుంకీలాల్

జూలూరుపాడు: పాఠశాలలో పరిశుభ్రత, పచ్చదనం ఉండేలా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని ఎంఈఓ బానోత్ జుంకీలాల్ అన్నారు. శనివారం జూలూరుపాడు కేజీబీవీలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమంపై హెచ్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం, తడి, పొడి చెత్తను డస్ట్‌బిన్‌ల ద్వారా వేరు చేయడం అవసరమన్నారు. విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రత ఆధారంగా పాఠశాలలకు రేటింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పాఠశాల పరిశుభ్రత, పచ్చదనానికి సంబంధించిన 60 రకాల ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ఎస్‌హెచ్‌వీఆర్ యాప్‌లో నోట్‌క్యాంప్ ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు, పాపకొల్లు, పడమట నర్సాపురం, కాకర్ల స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు టి.లక్ష్మీనర్సయ్య, ఎస్‌కె.మీరాసాహెబ్, పి.సంజీవరావు, హెచ్‌ఎంలు, ఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మంత్రి రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న సురేష్ నాయక్

టేకులపల్లి: రైతులకు సకాలంలో యూరియా అందించడంలో విఫలమైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు దారావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా లేక తీవ్రమైన కష్టాలు పడుతున్నారని, వ్యవసాయానికి సకాలంలో యూరియా అందక తెలంగాణ రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. యూరియా సమస్యపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. యూరియా సమస్య పరిష్కరించకుంటే ప్రభుత్వంపై పోరాటం తీవ్రంగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాణోతు కిషన్, సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్, జిల్లా ప్రచార కార్యదర్శి జరపల లాలు, లక్ష్మీపతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియకు సహకరించాలి



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న ఎంపీడీఓ అంకుబాబు



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

కొత్తగూడెంఅర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితాపై లక్ష్మీదేవిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.అంకుబాబు శనివారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా, పోలింగ్‌స్టేషన్లు, వార్డుల వారిగా ఓటర్ల ముసాయిదా జాబితాను వివరించి ఏమైనా అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా ఇవ్వాలని సూచించారు. నాయకులు ఎండీ.గౌస్, హుస్మర్‌ఖాన్, లక్ష్మీపతి, కోబాల్, కొట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జూలూరుపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ముసాయిదా ఓటర్ల జాబితాపై శనివారం ఎంపీడీఓ తాళ్లూరి రవి ఆధ్వర్యంలో రాజకీయ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవి మాట్లాడుతూ... ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్‌స్టేషన్లపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, భూక్యా రమేష్, నిమ్మటూరి రామారావు, రాజు, చలమల గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా అన్ని రాజకీయ పక్షాలు ఎన్నికల అధికారులకు సహకరించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండలంలోని వివిధ రాజకీయ పక్షాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే పంచాయతీ కార్యదర్శికి తెలపాలని సూచించారు. ఎంపీఓ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

టేకులపల్లి: మండలంలోని పంచాయతీల్లో మండల ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాలను ప్రదర్శించిన నేపథ్యంలో అభిప్రాయాలు సేకరించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బైరు మల్లేశ్వరి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఓటర్ జాబితాలో, పోలింగ్ కేంద్రాల్లో అభ్యంతరాలుంటే పంచాయతీ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. మెరుగైన, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు, ఓటర్ల జాబితా, పోలింగ్‌కేంద్రాల ఏర్పాటుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఎంపీవో జేఎల్ గణేష్ గాంధీ, నాయకులు పాల్గొన్నారు.



జూలూరుపాడులో..



టేకులపల్లిలో..